


దర్భా లక్ష్మీఅన్నపూర్ణ

# డిస్కౌంట్ల గది

నాంచారి వున్న ఆ కాస్త చిన్న ఇంట్లోనూ ఒక గదిని 'డిస్కౌంట్ సేల్స్' గదిగా పెట్టేసుకుంది. ఆ గదిని చూసుకున్నప్పుడల్లా ఆమె తన తెలివితేటలకి తనే మురిసిపోతూ శభాష్ అని చెప్పుకుంటూ తన జబ్బని తనే చరిచేసుకంటూ వుంటుంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి చెప్పలేనంత ఉత్సాహంగా వుంది. కారణం పక్కింటి పంకజాక్షి "మీ డిస్కౌంట్ల గది చూపించరూ" అంటూ వచ్చింది.

పంకజాక్షి ఈమధ్యనే పక్కింట్లో అద్దెకి దిగింది. ఆమెకి అప్పుడే తన డిస్కౌంట్ల గది గురించి తెలిసిపోవటం నాంచారికి చాలా గర్వకారణంగా వుంది.

"రండి! రండి!" అంటూ మహదానందంగా ఆహ్వానించింది పక్కింటి పంకజాక్షిని నాంచారి. ఆనందంతో పాటు ఉత్కంఠగానూ వుంది ఆమెకి 'తన డిస్కౌంట్ల గదిని చూసి పంకజాక్షి ఎలా రియాక్ట్ అవుతుందో' అని.

డిస్కౌంట్ల గది తలుపు తీస్తూనే తనంత ఎత్తులో వున్న డబ్బాల దొంతర మీద పడడంతో కెవ్వుమంది పంకజాక్షి.

"అయ్యయ్యో.. ఏవీ అనుకోకండి. డిస్కౌంట్‌లో..అదేలెండి బహుమతిగా వెయ్యి రూపాయల సరుకు కొంటే ఓ డబ్బాల సెట్టు బహుమతిగా ఇస్తున్నారని ఓ పదివేల రూపాయల సరుకు కొని తెచ్చిపడేశాను. ఇక డబ్బాలకి లోటు లేదనుకోండి" డబ్బాలను మురిపెంగా చూసుకుంటున్న నాంచారి కళ్లల్లో మెరుపుల వర్షం!

గదినిండా నిండిపోయిన రకరకాల సామాన్లు, సరుకులు! అన్నీ డిస్కౌంట్ సేళ్లలోనూ బహుమతులు ఇస్తున్న సేళ్లలోనూ కొన్నవే. అందుకే ఆ గదికి డిస్కౌంట్ల గదిగా ముద్దుగా, ముచ్చటగా పేరు పెట్టుకుంది నాంచారి. బియ్యం బస్తాలు, పప్పుల ప్యాకెట్లు, పాలపౌడర్ల ప్యాకెట్లు, సబ్బులు, నూనె సీసాలు... ఒకటేమిటి.. ప్రావిజన్ షాపుల్లో వుండే వస్తువులూ, బట్టల షాపుల్లో వుండే అన్ని రకాల బట్టలూ (కొన్ని బీరువాల్లో) అన్నీ దొంతర దొంతర్లుగా వున్నాయి.

ఎలాగో దారిచేసి పంకజాక్షిని లోపలికి తీసుకువెళ్లింది నాంచారి. గది మధ్యలోకి వెళ్లి నిల్చున్నారు. గదిలో సామాను రూఫ్‌ని తాకుతున్నట్టుగా వుంది. ఏదో ఒక కొత్త ప్రపంచంలోకి, ఇళ్లల్లో ఎప్పుడూ చూడని ఓ వింత ప్రపంచంలోకి వచ్చినట్టుగా కళ్ళు విప్పార్చుకుని అయోమయంగా వెర్రిమొహం వేసుకుని చూస్తున్న పంకజాక్షి చెవిలో గుసగుసగా అంది నాంచారి- "చూడ్డానికి ఇంత సరుకు కనిపిస్తోందా? కానీ డిస్కౌంట్ సేల్స్‌నూ, బహుమతులిస్తున్న సేల్స్‌నూ కొన్నాను కదండీ! అంతా లాభమే సుమండీ! చూడండి- ఎన్ని డబ్బాలు ఫ్రీగా వచ్చాయో" కిందపడి దొర్లుతున్న డబ్బాలను సవరిస్తూ అంది నాంచారి.

తన పక్కన తనంత ఎత్తువున్న కార్న్‌ఫ్లేక్స్ పాకెట్ల లోంచి ఓ పాకెట్టు తీసి యధాలాపంగా చూసిన పంకజాక్షి మనసులోనే ఉలిక్కిపడింది- అది రెండేళ్ల క్రితం నాటిది.

ఆ ఉలికిపాటుని గ్రహించిన నాంచారి అంది- "ఎక్స్‌పైరీ డేటు అయ్యేలోపుగా ఇచ్చేయాలని పాలల్లో ఓ పదేసి చెంచాలు చొప్పున వేసి ఇచ్చేస్తూ వుంటానులెండి. లాభానికి లాభం, బలానికి బలం"

కానీ పిల్లలు చూస్తే అలా లేరే అనిపించింది పంకజాక్షికి. వాళ్లు రెండు నెలలకోసారి జిగట విరేచనాలతో హాస్పిటల్లో చేరుతుంటారని పంకజాక్షికింకా ఎవరూ చెప్పలేదు. వాళ్లని చూస్తుంటే ఎందుకో విసుగ్గా, నిరాసక్తంగా, నీరసంగా- ఈ జీవితంలో మాకు సంతోషం కలిగించేదంటూ ఏమీ లేదన్నట్టుగా మొహాలు వేలాడేసుకుని వున్నారు. అసలు పిల్లకాయలంటే ఎలా వుండాలి? చెంగు చెంగున గంతులేస్తూ దేనికో దానికి ఫెళ్లుమని మారాం చేస్తూ కోరింది దొరకగానే ఫక్కుమని నవ్వేస్తూ, ముందున్న కాలం అంతా మాదే అన్నట్టుగా వుండాలి. అలాంటిది వాళ్ల కళ్లల్లో ఏ ఆసక్తీ లేదు.

డిస్కౌంట్ రూంలో వున్న వస్తువులన్నిటినీ చూస్తూ చూస్తూనే ఆలోచనల్లోకి వెళ్లిపోయిన పంకజాక్షి ఒక్కసారిగా కెవ్వున అరిచి గాల్లోకి లేచింది. దున్నపోతుల్లా వున్న రెండు ఎలకలు రన్నింగ్ రేస్ చేసుకుంటూ పంకజాక్షి కాళ్ల మీంచి వెళ్లిపోయాడు.

నాంచారికి విషయం అర్థం అయిపోయింది. విరగబడి నవ్వేస్తూ "మరీ అంత భయమైతే ఎలాగండీ?" అంది.

ఎలక మహారాజులు ఆ గదిలో సుష్టుగా భోంచేస్తూ మత్తుగా నిద్రిస్తున్నాయి అనటానికి ఆ గదిలో కింద అటూ ఇటూ చిమ్ముకుపోయిన పప్పులూ, బిస్కెట్ ముక్కలూ, చాక్లెట్ల రేపర్లూ నిదర్శనంగా వున్నాయి.

"అన్నీ డిస్కౌంట్లో వచ్చినవే కదండీ! కాసినన్ని అవి తింటే మటుకు నష్టం ఏవిటిట? పిల్లలకి ఏం కావాలన్నా ఈ గదిలోకి వచ్చి షాపులోంచి తీసుకున్నట్టుగా తీసుకుంటారు" గర్వంగా చెప్పింది నాంచారి.

డిస్కౌంట్ రూం చూడడం అయి ముందు గదిలోకి వచ్చాక నాంచారి మళ్లీ ఆ రూంలోకి వెళ్లి ఓ ప్లేటు నిండా రకరకాల బిస్కెట్లు, జంతికలు పెట్టుకుని వచ్చింది.

పంకజాక్షికి ఎందుకో తినబుద్ధి కాలేదు. వాటిని చూడగానే ఆ డిస్కౌంట్ల గదే ఆమె కళ్ల ముందు మెదులుతోంది. నాంచారి బలవంతంమీద ఎలాగో ఓ బిస్కెట్టూ, జంతికా తిన్నాననిపించింది. డిస్కౌంటల గదిని మరోసారి మెచ్చుకుని నిష్క్రమించింది పంకజాక్షి.

ఆమెకి ఒక్క విషయం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇంట్లో ఇన్ని వున్నా పిల్లలెందుకలా ఈసురో దేవుడా అన్నట్టుగా వున్నారు? అదే మాట తన పతిదేవుడితో అంటే అతగాడు ఇచ్చిన వివరణకి పంకజాక్షి అచ్చెరువుతో చిత్తరువైంది. అతగాడు చెప్పిన విషయం- "మనిషికి జీవితంలో అన్నిటికన్నా ఆనందాన్నీ, శక్తినీ ఇచ్చే అంశం- దేనికోదానికి ఆరాటపడుతుండడం, అందుకోసం ప్రయత్నిస్తూ వుండడం. అందుకే మనిషికి భగవంతుడు ఆకలి అనేది పెట్టాడు. జీవితం ఎప్పుడూ పసందుగా వుండాలంటే ఎప్పుడూ ఏదో ఒకటి అందీ అందనట్టుగా వుండాలి. పిల్లలకేం వుంటాయ్ అలాంటవి- చాక్లెట్లూ, బిస్కెట్లూను! అవి ఎక్కడో షాపులో దూరంగా వుండి వాళ్లని వూరిస్తూ వుండాలి. వాటిని కొనిపెట్టమని అమ్మని అడగాలి. కొననంటే పేచీ పెట్టి మరీ కొనిపించుకోవాలి అన్న ఆలోచన పిల్లల్లో ఓ విధమైన ఉత్సాహాన్ని పుట్టిస్తుంది. అమ్మ అడిగింది కొనిపెడుతుందో లేదో అన్న దిగులు వాళ్లల్లో ఎంత లోతులకి వెళ్తుందో కొనిపెట్టాక అడిగింది చేతిలోకి వచ్చాక ఉత్సాహం అంత ఎత్తయిన శిఖరాలకి చేరుతుంది. నీకు ఏది అతిగా సులభంగా అందుబాటులో వుంటుందో దానిమీద ఆసక్తి పోతుంది. పైగా చిన్నపిల్లలు- ఇలాంటి సూత్రాలలోని లోపాలను సరిగ్గా అర్థం చేసుకోలేని వయసు వాళ్లది"

'అబ్బ! ఎంత నిజం కదూ! అందుకే ఆ పిల్లలు అలా

ఏ ఉత్సాహమూ లేకుండా వున్నారు'

అతగాడు చెప్పింది అక్షరాలా నిజం అన్నట్టుగా ఆరోజు ఆ సంఘటన జరిగింది. పంకజంతో నాంచారి కూర్చుని మాట్లాడుతూ వుండగా పిల్లలు ఆకలేస్తోంది.. తినటానికి ఏమైనా కావాలంటూ పేచీ పెట్టారు.


"వెళ్లండమ్మా! మన డిస్కౌంట్ రూం వుందిగా. దాన్లోంచి ఏం కావాలంటే అవి తీసుకోండి" గొప్పగా అంది నాంచారి...తనంత తెలివైన తల్లి ఏ ప్రపంచంలోనూ వుండదన్నట్టుగా.

"ఛీ... అవ్వి మాకొద్దు.. మాకు షాపులో వున్నవే కావాలి"

నాంచారిలో ఒక్కసారిగా కోపం ఉప్పెనలా పొంగుకొచ్చింది. తను చేసిన నిర్వాకం ఏవిటో వీళ్లకి అర్థం అయి చావట్లేదు అని తలకొట్టుకుంది. "ఇవన్నీ కూడా షాపుల్లోంచి తెచ్చినవేనర్రా వెర్రి మొహాల్లారా"

"అయినా సరే! మాకు మేం షాపులోంచి కొని తెచ్చుకుంటేనే బావుంటుంది" పంకజానికి పతిదేవుడు చెప్పిన నగ్నసత్యం కళ్లముందు సాక్షాత్కరించింది. పిల్లలకి వాళ్ల మనసులో వున్నదేదో స్పష్టంగా చెప్పటం చేతకావటం లేదంతే.

"ఇదేం పేచీఅర్రా పిచ్చిమొహాల్లారా! కావలసినవన్నీ ఇంట్లోనే వుంటే బయటికి పోతాం అని అఘోరిస్తారేవిటీ?" అని పంకజంవైపు తిరిగి "మా పిల్లలు ఇలా పేచీ పెట్టటం ఇదే మొదటిసారి" ఆశ్చర్యంగా అంది.






నాంచారి మాటకి పంకజం మనసులో అనుకుంది- 'వాళ్ల మనసులు ఇక భరించలేక తిరగబడ్డాయన్నమాట'

నాంచారి ఇక భరించలేనట్టుగా సహనం కోల్పోయి వాళ్ల రెక్కలు పుచ్చుకుని బరబరా డిస్కౌంట్ల గదిలోకి లాక్కుని వెళ్లి చాక్లెట్ల గుట్టలనీ, బిస్కెట్ల గుట్టలనీ చూపించి "ఏం కావాలో తీసుకోండి" అని హుంకరించింది

వాళ్లు ఆ గుట్టల వైపు ఓ తిరస్కారచూపు విసిరి, ఆపైన ఆ డిస్కౌంట్ల గది నంతటినీ ఒకసారి కలయజూసి కోరస్‌గా "ఛీ" అనేసి వెళ్లిపోయారు.

తను కూడా ఒక డిస్కౌంట్‌ల గదిని ఏర్పాటు చేసుకోవాలన్న మనసు మూలల్లో ఎక్కడో దాగివున్న ఒక ఆలోచన తన అస్థిత్వాన్ని రూపుమాపుకుని పంకజం మస్తిష్కంలోంచి నిష్క్రమించింది.

నాంచారి డిస్కౌంట్ల జీవితంలో ఓ పెద్ద మలుపుకి పునాది అత్తగారి రాకతో పడింది.

మీ డిస్కౌంట్ల రూమేదీ అని పదిళ్ల అవతలావిడ అడుగుతున్నప్పుడు గర్వంతో పొంగిపోతున్న కోడల్ని చూస్తుంటే చిర్రెత్తుకొచ్చింది అండాళ్లమ్మకి. కానీ నోరెత్తే సాహసం చెయ్యలేకపోయింది. నిమిషానికోసారి డిస్కౌంట్ల రూంలోకి వెళ్లొస్తోంది ఆశ్చర్యాన్ని తట్టుకోలేక. దాన్లోకి వెళ్లిన ప్రతీసారీ తను ఏదో ఓ గుంపులో చిక్కుకుపోయినట్టు, నాలుగు పక్కల నుంచీ తనని ఎవరో తోసేస్తున్నట్టుగా భ్రాంతి చెందుతూ భుజాలు తడుముకోసాగింది. సంసారంలో ప్రతిదాన్నీ అవసరానికి ఓ చిటికెడు తక్కువగానే కొంటూ సంసారం నెట్టుకొచ్చిన బాపతి మరి అండాళ్లమ్మ. ఎక్కడ ఏ వస్తువు తక్కువకి దొరికితే అక్కడ్నించి ఆ వస్తువుని కొని తెచ్చుకోవటం, అదీ ముందు చూపుతో కాస్తంత ఎక్కువగానే కొని తెచ్చుకోవటానికి అండాళ్లమ్మ వ్యతిరేకం కాదు. కానీ నట్టింటి లక్ష్మిగా వుండాల్సిన నాంచారి ధోరణి చూస్తుంటే డిస్కౌంట్ల పేరు చెప్పి అవసరానికి మించిన సరుకూ, అక్కర్లేని వస్తువులూ కొని డబ్బుని వృథా చేసేస్తున్నట్టుగా అనిపించింది.

డిస్కౌంట్ సేల్స్‌కి ఎంతో కష్టపడి వెళ్తా అన్నీ తక్కువ రేట్లో కొని దాచినందుకు కోడల్ని అందలాలెక్కించేస్తున్నట్టుగా పైకి మాట్లాడుతూ డిస్కౌంట్ల రూంలో ఇంచుమించుగా సరుకెంత వుందో అంచనా వెయ్యటానికి ప్రయత్నించి గుండె గుభేలుమనగా మనసులో మాత్రమే అనుకుంది- 'అయ్యో! నా కొడుకు సంసారాన్ని కొల్లేరు చేసేస్తున్నావ్ కదుటే' అని. కానీ ఓ విషయం మాత్రం అనుకుంది అండాళ్లమ్మ- ఇదంతా ఏదో పొదుపు చేసేస్తున్నాను అన్న వుద్దేశంతోనే నాంచారి చేస్తోందని.

నాంచారి మళ్లీ ఏదో డిస్కౌంట్ సేల్- సిటీకి అరవై మైళ్ల దూరంలో వుందంటూ వెళ్లిన ఒకానొక సందర్భంలో కొడుకుని దగ్గర కూర్చోబెట్టుకుని డిస్కౌంట్ల రూంలో వున్న వస్తువుల లెక్కల వివరాలన్నీ కొడుకు ముందుంచి "నువ్వింత చవటాయ్‌వి ఎప్పుడైపోయావురా" అంది అనూహ్యంగా.


నరసింహానికి ఒక్కసారిగా నెత్తిమీద పిడుగు పడ్డట్టుగా అయింది.

తన భార్య నిర్వాకాన్ని చూసి అమ్మ మెచ్చుకుంటోందన్న భ్రమలో గర్వంగా మొహం పెట్టబోయిన నరసింహం గతుక్కుమన్నాడు తల్లి మొహంలో భావప్రకటనని చూసి- "అదేవిటే అమ్మా! అంత మాటనేశావ్?" అన్నాడు.

"లేకపోతే ఏవిటీ? ఇవన్నీ నీ చవటతనానికి నిదర్శనం కాదూ? డిస్కౌంట్ల పేరు చెప్పి వాళ్ల పాత సరుకంతా మన చేత కొనిపిస్తున్నారు. పైగా ఆ డిస్కౌంట్ ఇస్తున్న విషయం నిజమో కాదో కూడా తెలియదు ఒక్కోసారి. ప్రతి వస్తువు గురించి నేను చెప్పలేనుగానీ- ఉదాహరణకి బట్టలే తీసుకుందాం. ఒకటి కొంటే రెండు ఫ్రీ! నిజానికి ఆ మూడింటి రేటూ ఆ ఒక్క దానిమీదే వుంటుంది. నీకు అవసరంలేని నలిగిపోయిన, మురిగిపోయిన బట్టలు నీ చేత కొనిపిస్తున్నారు. అవసరానికి మించిన బట్టలు మన..కాదు..నీచేత కొనిపిస్తున్నారు. వాళ్లు తెలివిగా నిన్ను బుట్టలో పడేస్తున్నారు. అది వ్యాపార సూత్రం! మనకెంత వరకూ ఆ సరుకు అవసరం అన్న విషయం మనం ఆలోచించుకోవాలి. వాళ్లు విసిరేద్దాం అనుకున్న బట్టలు నీచేత కొనిపించి నిన్ను వెర్రి వెధవని చేస్తున్నారని నీకు తెలియలేదట్రా బడుద్ధాయ్"

'నిన్ను వెర్రి వెధవని చేస్తున్నారు' అన్న ఆ మాట నరసింహం నరనరాల్లోనూ జరజరమని పాకిపోయింది. అతగాడు ఏదయినా సహిస్తాడు గానీ తనని ఎవరైనా మోసం చేస్తున్నారు, వెర్రివెంగళప్పని చేస్తున్నారు అన్న భావాన్ని మాత్రం తట్టుకోలేడు. తన దగ్గరున్నదంతా ఇచ్చేయమని డైరెక్టుగా అడిగితే ఇచ్చేస్తాడుగానీ అదే ఎదుటివాళ్లు మోసం చేసి తన దగ్గరున్నది లాక్కోవాలని ప్రయత్నిస్తున్నారని తెలిస్తే మాత్రం నరసింహావతారం ఎత్తేస్తాడు. చిన్నప్పట్నించీ అతగాడిలోని ఆ స్వభావాన్ని పసిగట్టిన ఆ తల్లి ఇప్పుడు నిజంగానే ఆశ్చర్యపోతోంది. ఇప్పటిదాకా ఊరుకున్నాడు అంటే తను మోసపోతున్న విషయం గ్రహించలేదన్నమాట! అందుకే ఈ డిస్కౌంట్ల గదిని మూయించెయ్యటానికి ఆ బ్రహ్మాస్త్రాన్ని ఉపయోగించింది.

ఎండ వస్తుందని డిస్కౌంటూ, వచ్చిందని డిస్కౌంటూ, వచ్చి వెళ్లిపోయిందని డిస్కౌంటూ, వర్షం వస్తుందని డిస్కౌంటూ, వచ్చి వెలిసిపోయిందని డిస్కౌంటూ! బరువు పెరగటానికి డిస్కౌంట్! పెరిగింది తగ్గించుకోవటానికి డిస్కౌంటు! ఇప్పుడు ఉత్పత్తిదారులందరూ నీకంటే తెలివిగా నేను వినియోగదారుడ్ని ప్రలోభపెడతాను అంటుంటే- నీకంటే నేనే ఎక్కువగా వాళ్లని బడుద్ధాయిల్ని చేస్తామని పోటీపడుతున్నట్టుగా వుంది ఈ డిస్కౌంట్‌ల ధోరణి చూస్తుంటే.



## వెంకీ స్పెషల్

**వెంకటేష్ కొత్త చిత్రంలో ఏకంగా ఐదుగురు హీరోయిన్‌లుంటారని సినీజనాలు అంటున్నారు. కన్నడంలో హిట్టయిన 'ఆప్తరక్షక'కి (చంద్రముఖి-2) రీమేక్ అయిన ఈ తెలుగు చిత్రంలో వెంకటేష్‌తో అనుష్క, కమలినీ ముఖర్జీ, రిచాగంగోపాధ్యాయ, శ్రద్ధాదాస్, పూనమ్ కౌర్‌తోపాటు మరో హీరోయిన్ కూడా నటించవచ్చునని వార్తలు. పి.వాసు దర్శకత్వం వహించే ఈ సినిమా షూటింగ్ చాలావరకు బ్యాంకాక్‌లోని ఓ బిల్డింగ్‌లో చేయబోతున్నారని ఆల్రెడీ ఆ భవంతిని అద్దెకి తీసుకోవడం జరిగిందనీ సమాచారం.**

ఇంతకాలం నాంచారి తెలివిగా వ్యవహరిస్తోందనుకున్నాను. ఏ వ్యాపారస్తుడూ కోరికోరి నష్టానికి వ్యాపారం చేయడు. ఒకటి కొంటే రెండు ఫ్రీ అన్నది సాధ్యం కాని విషయం అని మనసుకి ఎక్కడో తెలుస్తున్నా అదొక రకమైన భ్రాంతిలో వినియోగదారుడు పరుగులు పెడుతున్నాడు.

నరసింహానికి మొన్నామధ్యన ఓ చొక్కా రెండుసార్లు తొడుక్కోగానే మూలపడేసిన సంగతి జ్ఞాపకం వచ్చి జ్ఞానోదయం అయినట్టుగా అనిపించింది. అందులోనూ తను వెర్రివెంగళాయ్ కావటం! ఇది సహించరాని విషయం! తనెందుకు గ్రహించలేకపోయాడు? నరసింహం ఆలోచన అతనికి చెప్పింది- నాంచారి మీద వున్న ప్రేమ వల్ల అలా జరిగింది! అంటే- ఇందులో నీ తెలివి తక్కువతనం ఏమీలేదు. కాబట్టి ఇప్పుడైనా కళ్లు తెరిచి జాగ్రత్తపడు అని మనసు హెచ్చరించింది.

నాంచారి అప్పుడే గుమ్మంలో ఆటోలోంచి దిగింది. ఆటోనిండా సామానులు! ఓ మూలగా కాళ్లు కూడా సామాన్ల మీద పెట్టుకుని నక్కినక్కి కూర్చున్నట్టుగా కూర్చోవలసి వచ్చింది. ఆమె ఆటోలోంచి దిగుతుండగా చూసిన నరసింహం వెర్రెత్తిపోయాడు. డిస్కౌంట్ల గదిలోకి వెళ్లి తేరిపార చూశాడు. అందులోని ప్రతి వస్తువూ తనని చూసి 'ఓరి వెర్రివెంగళాయ్' అని గేలి చేస్తూ విరగబడి నవ్వుతున్నట్టుగా అనిపించింది.

"నాంచారీ!" ఆ గది మధ్యలో నిలబడి గట్టిగా గళం విప్పాడు.

సామాన్లన్నీ ఆటోడ్రైవర్ సహాయంతో లోపలికి చేర్చి 'హమ్మయ్య' అని విశ్రమిద్దాం అనుకోబోతున్న నాంచారి పరుగులాంటి నడకతో వచ్చింది డిస్కౌంట్ల రూంలోకి.

"ఏమిటండీ అలా గర్జించారు? మనం నా తెలివితేటల వల్ల ఎంత లాభపడిపోతున్నామో అంచనా వేసి ఆనందం పట్టలేకపోతున్నారా?"

అమాయకంగా చెంపల్ని గర్వంతో సవరించుకుంటూ ప్రశ్నిస్తున్న భార్యామణిని చూసేసరికి నరసింహం చల్లబడిపోయాడు. హుంకరిద్దాం అనుకున్నాడు గానీ 'ఏదో నిర్వాకం చేద్దాం అనే ఉద్దేశంతోనే కదా నాంచారి ఇదంతా చేసింది. వివరంగా చెబితే అప్పుడే మానేస్తుంది' అనుకున్నాడు మళ్లీ మనసులో.

పెళ్లాన్ని చూడగానే ఇంతెత్తున లేస్తాడనుకున్న కొడుకు చప్పబడిపోవటం ఆ తల్లికి నీరసాన్ని తెప్పించింది. తను రగిల్చిన ఆవేశం అంతా ఇంత చప్పగా చల్లారిపోతుంటే ఎలా అని తల్లడిల్లిపోయిందే గానీ ఆ ఆవేశం ఇంకో రూపాన్ని సంతరించుకుంటోందన్న విషయం ఆమె ఊహకి అందలేదు.

* * *

రెండు రోజుల తర్వాత-

ఓ సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూనే "నాంచారీ నాంచారీ!" అంటూ మహదానందంగా పిలిచాడు నరసింహం.

ఆ గొంతులో ఆనందం పరవళ్లు తొక్కుతోంది. ఆ పిలుపుని విన్నవాళ్లకి వెంటనే అనిపిస్తుంది ఏదో అద్భుతం జరిగినట్టు చెప్పబోతున్నాడని. అందుకే పక్కగదిలో కూర్చుని వత్తులు చేసుకుంటున్న ఆండాళ్లు కూడా బయటికి వచ్చింది. నాంచారి ఎలాగూ వచ్చింది. నరసింహం చేతిలో వున్న పది సిగరెట్ల ప్యాకెట్లనీ ఆనందంగా టేబుల్ మీద పెడుతూ అన్నాడు- "ఒక ప్యాకెట్టు కొంటే రెండు ప్యాకెట్లు ఫ్రీ! అందుకే మూడు కొన్నాను. మొత్తం మూడు కొంటే తొమ్మిదొచ్చాయ్. ఇంకొకటి కొసరిచ్చాడు"

నాంచారి మొహంలో ఒక్కసారిగా భయం, కోపం, చిరాకు అన్నీ కలిసిపోయి కనిపించాయి. నరసింహానికి సిగరెట్టు అలవాటు దురలవాటుగా మారకూడదని ఒక్కొక్క సిగరెట్టే షాపు నుంచి తెప్పించుకోవాలని నిబంధన పెట్టింది. అతగాడు కూడా భార్యామణి అభిప్రాయంతో ఏకీభవించి ఇప్పటిదాకా అలాగే చేస్తున్నాడు.

ఆండాళ్లమ్మ మొదట్లో కంగారుపడినా కొడుకేదో ప్లానుతోనే ఇలాంటి పని చేశాడని అర్థం చేసుకుంది.

నాంచారి కూడా రెండో క్షణంలో మొహం మార్చేసి- "నాలాగే మీ తెలివితేటలు ఉపయోగించి మంచిపని చేశారండి మీరు కూడాను" అంది. నరసింహం బిక్కచచ్చిపోయాడు.

మర్నాడు ఏ షాపులో డిస్కౌంట్ ఇస్తున్నారో కనుక్కుని ఇంకో పది ప్యాకెట్లు తెచ్చింది నాంచారి. కోడలి ధోరణికి విరుచుకుపడబోయింది ఆండాళ్లమ్మ. అందుకు అడ్డు చెబుతూ చిరునవ్వుతో అంది నాంచారి- "కంగారు పడకండత్తయ్యగారూ- మీ అబ్బాయి ఆరోగ్యం పట్ల శ్రద్ధ నాక్కాకపోతే ఎవరికుంటుంది? అన్ని చాక్లెట్లూ, బిస్కెట్లూ డిస్కౌంట్ల రూంలో చూసేసరికి పిల్లలకి వాటి మీద అసహ్యం పుట్టి తినటం మానేశారు. మీ అబ్బాయికి కూడా సిగరెట్లంటే అసహ్యం వెయ్యాలనే ఇన్ని తెచ్చాను"

ఆండాళ్లమ్మ కళ్లు ఆనందబాష్పాలతో మసకబారాయి. "అయితే అసలు పాయింటు గ్రహించావన్నమాట"

"మంచి మాట ఎవరు చెప్పినా వింటాను" నాంచారి చెంపలు అలా అలా సవరించుకుంటూ అంది.

## రెడీ అవుతున్న రోబో

ఎప్పుడెప్పుడా అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న రజనీకాంత్ 'రోబో' (తమిళంలో 'యంతిరమ్') ఒక్క పాట మినహా షూటింగ్‌ని ఈమధ్యనే పూర్తి చేసుకుంది. అతి త్వరలోనే ఆడియోని రిలీజ్ చేసే ప్రయత్నాల్లో వున్నాట్ట దర్శకుడు శంకర్. అయితే సినిమా మాత్రం ప్రేక్షకుల ముందుకు రావాలంటే ఒకటి రెండు నెలలపైనే పట్టవచ్చునని చెన్నయ్ సినీవర్గాల సమాచారం. 'శివాజి' తర్వాత రజనీకాంత్ నటిస్తున్న 'రోబో' మీద చాలా భారీ అంచనాలున్నాయి. మరి అవన్నీ ఏమవుతాయో! శివాజి రిలీజై అప్పుడే మూడేళ్లు కావస్తోంది.

